


పాతబస్టాండ్ సమీపంలోని దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ


సంకల్‌బాగ్‌లో..


అశోక్‌నగర్‌లో..

ఘనంగా గురుపౌర్ణమి


సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కర్నూలు (కల్చరల్), జూలై 21: జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచి రాత్రి దాకా ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో సాయి సత్యవ్రతం చేశారు. షిరిడీ సాయిబాబా, దత్తాత్రేయ దేవాలయాలు, పుట్టపర్తి సత్య సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, మహా మంగళహారతులు, పల్లకీ సేవ, అఖండ సాయి నామ పారాయణాలు నిర్వహించారు. గురు పౌర్ణమి రోజున వ్యాస మహర్షి జయంతి సందర్భంగా వ్యాస భగవానుడిని, యోగశాస్త్రాన్ని అందించిన పతంజలి మహర్షిని గురుస్థానంలో పూజిస్తూ వీహెచ్‌పీతోపాటు పలు యోగా సంస్థల సభ్యులు తమ గురువులను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వేళల్లో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు భారీగా తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు.








దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయంలో




జగనన్న కాలనీలో వర్షపు నీళ్లలో ఉన్న గృహాలు

జగనన్న కాలనీలో వైసీపీ దందా

- టీడీపీ అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లు పరార్
- నాసిరకంగా నిర్మాణాలు
- నిద్రావస్థలో హౌసింగ్ అధికారులు

ఆదోని, జూలై 21:

జగనన్న పాలనతో వైసీపీ నాయకుల దందా ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. పేదల పేరుతో పెద్దలు అందిన వరకు దండుకున్నారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చడానికి చేపట్టిన జగనన్న కాలనీల్లో వైసీపీ నాయకుల అక్రమాలు బైటపడుతున్నాయి. ఆదోనిలో జగనన్న కాలనీలో పేరుతో వైసీపీ నాయకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దందా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వ కాలంలో జగనన్న కాలనీల్లో వైసీపీ నాయకుల కుంభకోణం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఆదోని పట్టణానికి 7 కిలోమీటర్ల దూరంలో దాదాపు దానాపురం సమీపంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. కాలనీలో 5,101 ఇళ్లు మంజూరు కాగా, ఏ ఒక్కటి కూడా పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించలేదు. మంజూరైన 5,101 ఇళ్లలో వివిధ దశల్లో కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జగనన్న కాలనీని పరిశీలిస్తే.. 2,484 ఇళ్లు స్లాబ్ లెవెల్, 244 ఇళ్లు రూఫ్ లెవెల్, 29 ఇళ్లు లెంటల్ లెవెల్, 1,537 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 186 ఇళ్లు ఫింత్ బీమ్ లెవెల్, 172 ఇళ్లు బిలో బేస్ మెంట్ లెవెల్‌లో ఉన్నాయి. ఇంకా 449 ఇళ్లు నిర్మాణానికే నోచుకోలేదు. అయితే ఈ ఇళ్లు మినహా మిగతా ఇళ్లకు అవసరమైన స్టీలు, సిమెంట్, ఇసుకను గృహ నిర్మాణ శాఖ అందజేసింది.


13 టన్నులు మాత్రమే నిల్వ ఉన్న స్టీలు

మెటీరియల్ మాయం...

ఇళ్ల నిర్మాణాలకు స్టీలు, సిమెంటు, ఇసుక ఎంత ఇచ్చారు..? వాటిలో ఎంత వినియోగించారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. బేస్మెంట్ వరకు ఒకసారి, ఆ తర్వాత మరో రెండు దఫాలు నిర్మాణ సామగ్రిని కాంట్రాక్టర్లకు అందజేశారు. అయితే మెటీరియల్ వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచే కాంట్రాక్టర్లు నిర్మాణాలు ఆపేశారు. అయినా అధికారులు సైతం వారిని పట్టించుకోలేదు. కౌంటింగ్ అనంతరం ప్రభుత్వం మారడంతో జగనన్న కాలనీలో మిగిలిన మెటీరియల్‌ను కూడా రాత్రికి రాత్రి తరలించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చివరిలో 70 టన్నులు స్టీలు ఎలక్షన్ సమయంలో అందించినట్లు స్థానిక అధికారులు చెబుతుండగా.. ప్రస్తుతం అక్కడ మాత్రం 13 టన్నుల వరకు మాత్రమే స్టీలు ఉన్నట్లు గుర్తించారు. ఇసుక, కంకర ఇండ్ల నిర్మాణం జరిగే ప్రదేశంలో లేకపోవడం గమనార్హం. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు అధికారులు ముందుగానే బిల్లులు చెల్లించి ఆ నిధులతో ఇండ్ల నిర్మాణాలు చేపట్టేలా కొందరికి సహకరించారు. కాంట్రాక్టర్లు స్థానిక అధికారులతో మాట్లాడకుండా నేరుగా మంత్రులతోనూ, రాష్ట్ర అధికారులతోనూ మాట్లాడి బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారాక సదరు కాంట్రాక్టర్‌లంతా పత్తాలేకుండా పోయారు. ఈ విషయంపై హౌసింగ్ డీ రవికుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఎన్నికలు ఫలితాలు వచ్చిన తర్వాత పనులు నిలిపేశారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం పనులు చేయాలని ఆదేశిస్తే తప్ప పనులు జరగవని అన్నారు. స్టీలు, ఇసుక ఎవరూ తరలించలేదని లెక్కలు ఉన్నాయని వివరణ ఇచ్చారు.


జగనన్న కాలనీలోని అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

ఇప్పటి వరకు బిల్లులు తీసుకున్నది....

జగనన్న ఇళ్లకు గాను ఒక ఇంటి నిర్మాణానికి సెంటు భూమి మాత్రమే ఇవ్వడంతో లబ్ధిదారులు ఎవరూ మొగ్గు చూపలేదు. దీంతో ప్రభుత్వమే కట్టించి ఇస్తామని ప్రకటించి నిర్మాణ పనులను నెల్లూరు చెందిన జేఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ చెందిన జనార్దన్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలకు అప్పగించింది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలతో పాటు పొదుపు సంఘం సభ్యుల నుంచి రూ.30వేల వరకు రుణం తీసుకోవచ్చు. అయితే ఇదంతా.. కాంట్రాక్టర్ ఖాతాకు జమవుతుంది. ఈ చాలీ చాలని నిధుల్లో సంబంధిత కాంట్రాక్టర్ చేతి వాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు రూ. 363.38 కోట్ల బిల్లులు మంజూరు అయ్యాయి. సిమెంట్ 2.63 లక్షల సంచులు ఇళ్లకు వినియోగించారు. ఇప్పటి వరకు 1,359 టన్నుల స్టీల్‌ను ఇంటి నిర్మాణానికి వినియోగించినట్లు లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు ఇండ్ల నిర్మాణంలో వేగం లేకపోవడంతో అధికా రులు తలను పట్టుకున్నారు. నిర్మాణాలను కూడా నాసిరకంగా చేపట్టారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.


జగనన్న ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది


శాకంబరిగా అమ్మవారు

శాకంబరి అలంకరణలో భ్రామరి

వివిధ రకాల కూరగాయలతో దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీశైలం, జూలై 21: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని భ్రమరాంబాదేవి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా అర్చకులు, వేదపండితులు లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠిస్తూ మహాగణతికి పూజలు నిర్వ హించారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పలు రకాలు ఫలాలతో భ్రమరాంబ అమ్మవారి మూలమూర్తి, ఉత్సవ మూర్తి, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరీ అమ్మవారికి, గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక శాకాలం కరణ చేశారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణాన్ని సైతం సుందరంగా అలంకరించారు.


క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

పూర్వ స్థానాలకు తహసీల్దార్లు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 21 : సార్వత్రిక ఎన్నికల ముందు జోన్-4 కు సంబంధించి తహసీల్దార్లు వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లను కలెక్టర్ రంజిత్ బాషా బదిలీ చేశారు. ఇతర జిల్లాల్లో పని చేస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 61 మంది తహసీల్దార్లు పూర్వ స్థానాలకు రానున్నారు.

ఎల్లెల్సీ కాలువకు జలకళ


చింతకుంట వద్ద కళకళలాడుతున్న ఎల్లెల్సీ

హాలహర్వి, జూలై 21: కన్నడనాట కస్తూరి తుంగభద్రమ్మ సరిహద్దు చేరుకుంది. దీంతో ఎల్లెల్సీ నీటిప్రవాహంతో కళకళలాడుతోంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఏడాది ముందస్తుగా జలవనరుల శాఖ అధికారులు ఎల్లెల్సీ కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు టీబీపీ బోర్డు ఈఈ నీలకంఠారెడ్డి తెలిపారు. ప్రతి గంటకూ కాలువ నీటిని పెంచుతూపోతామన్నారు. జిల్లా ప్రజలు ముందుగా తాగునీటి కోసం ఉపయోగించుకోవాలని, అనంతరం ఆయకట్టు రైతులకు అవకాశం కల్పిస్తామన్నారు. తుంగభద్ర జలాశయనికి భారీగా వరద వచ్చి చేరడంతో నీటి నిల్వ 77 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఆదివారం చింతకుంట మీదుగా బాపురం, హొళగుంద మండలం వైపు తుంగభద్రమ్మ ప్రవాహం కొనసాగుతోంది.

మంత్రాలయంలో మృత్తిక సంగ్రహణ ఉత్సవం

మంత్రాలయం, జూలై 21: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ఏడాదికోసారి జరిగే మృత్తిక(మట్టి) సంగ్రహణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గురుపౌర్ణమి పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తుంగభద్ర నదితీరంలో ఉన్న తులసివనం వరకు బంగారు పల్లకిని ఊరేగింపు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య పీఠాధిపతి తులసివనంలో మృత్తికకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. మృత్తికను సేకరించి బంగారు పల్లకిలో ఉంచి సంప్రదాయ పద్ధతిలో భక్తుల జయధ్వనుల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మృత్తికను రాఘవరాయడి మూల బృందావనం ఎదుట ఉంచి పూజలు చేశారు. ఈ మట్టిని ఎంతో పవిత్రంగా ఏడాది పాటు విశిష్టతగా భావించి నూతనంగా దేశంలో ఎక్కడైనా రాఘవేంద్రస్వామి బృందావనం ఏర్పాటు చేసే సమయంలో వినియోగిస్తారు. అంతకు ముందు రాఘవరాయడికి విశేష పూజలు, అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, రజిత, గజవాహనం, బంగారు, నవరత్నాల రథాలపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మఠం దివాన్‌శ్రీనాథ్ ఆచార్, ఎస్ఎస్ వెంకటేష్‌ఆచార్, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతిఆచార్, ఐపీ నరసింహమూర్తి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థఆచార్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.


బంగారు పల్లకిలో ఉంచిన మృత్తికకు పూజలు చేస్తున్న పీఠాధిపతి


శ్రీమఠంలో ఘనంగా గురు పౌర్ణమి


నది తీరంలో ఉన్న తులసివనానికి ఊరేగింపుతో వెళ్తున్న పీఠాధిపతి, పండితులు



గళమెత్తాలి.. నిధులు రాబట్టాలి..!

- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల పడకేసిన ప్రగతి
- పురోగతి లేని సాగునీటి ప్రాజెక్టులు
- నిరుపయోగంగా టిడ్కో గృహాలు
- కందనవోలు ముంగిట సమస్యలు ఎన్నో
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



కర్నూలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి)

సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 21న తొలిసారిగా సమావేశమైంది. ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. నేటి నుంచి ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అమరావతికి చేరుకున్నారు. ఎమ్మిగనూరు బీవీ జయనాగేశ్వరరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మినహా కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలు మంత్రి టీజీ భరత్, బొగ్గల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పార్థసారథి, బి.విరుపాక్షి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి పడకేసింది. సాగునీటి ప్రాజెక్టులు గతితప్పాయి. రూ.వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన టిడ్కో ఇళ్లు నిరుపయోగంగా వదిలేశారు. ఇంటింటికి కుళాయి ఇవ్వాలనే లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్‌ను అక్రమాల పుట్టగా మార్చేశారు. పల్లెసీమ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. వైద్యం అందని ద్రాక్షగా తయారైంది. జగనన్న కాలనీలు జగమొండి కాలనీలుగా మరాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో. జిల్లా ప్రగతి కోసం ఎమ్మెల్యేలు గళం విప్పాలి.. సీఎం చంద్రబాబును ఒప్పించి నిధులు రాబట్టాలి. కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు జిల్లా కోసం పోరాడి చర్చల్లో మమేకం కావాలి. మొత్తంగా జిల్లా ప్రగతికి భారీగా నిధులు రాబట్టాల్సిన బాధ్యతను ప్రజాప్రతినిధులు సమష్టిగా తీసుకోవాలి. నేటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు అందుకు వేదికవ్వాలి.

జల్‌జీవన్ మిషన్‌పై వాణి వినిపించాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయి ఇవ్వాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ అమలు చేస్తుంది. కర్నూలు జిల్లాలో రూ.197.76 కోట్లతో 1,026 పనులకు అనుమతులు ఇచ్చారు. 465 పనులు చేపడితే 293 పనులు పూర్తి కాగా.. 79 పనులు పురోగతిలో ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ.115.80 కోట్లతో 522 పనులకు పరిపాలన అనుమతులు వస్తే.. 416 పనులు చేపట్టారు. 232 పూర్తి చేయగా 152 పనులు పురోగతిలో ఉన్నాయి. అంటే.. ఉమ్మడి జిల్లాలో రూ.313.56 కోట్లతో 1,548 పనులకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే.. 881 పనులే చేపట్టారు. అందులో పూర్తయినవి 525 పనులే. అంటే.. ఏళ్ల గడిచినా 1,023 పనులు మొదలే పెట్టలేదు. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వదనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేకపోయారు. చేసిన పనుల్లో కూడా అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కర్నూలు నగరం, ఎమ్మిగనూరు, కోడుమూరు పట్టణాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీటి పైపులైన్ పనులకు నిధులు రాబట్టే దిశగా ఎమ్మెల్యేలు గళమెత్తాలి.

పేదలకు టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి

పట్టణ పేదలకు గూడు-నీడ కల్పించాలనే సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఏపీ టిడ్కో ఇళ్లు నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ఇళ్లకు ఆ పార్టీ జెండాను పోలిన రంగులు వేసి వదిలేశారు. పేదలకు పంపిణీ చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కర్నూలు శివారులో జగన్నాథగట్టు వద్ద 10 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టి 9,185 ఇళ్లు పూర్తి చేశారు. ఆదోని పట్టణం సిరుగుంప సర్కిల్ సమీపంలో 4,704 ఇళ్లు చేపట్టి 3,800 పూర్తి చేశారు. ఎమ్మిగనూరు పట్టణం శివన్న నగర్, మైనార్టీ కాలనీల్లో 3,250 ఇళ్లు చేపట్టి 3,164 ఇళ్లు పూర్తి చేశారు. నంద్యాల పట్టణం ఎస్సార్బీసీ కాలనీలో 10 వేల ఇళ్లు చేపట్టి 5,075 ఇళ్లు పూర్తి చేశారు. అంటే ఈ రోజుకు 21,300 టిడ్కో ఇళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నా.. చంద్రబాబుకు పేరు వస్తుందని గత జగన్ ప్రభుత్వం పేదలకు ఇవ్వలేదు. వాటిపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.



నిరుపయోగంగా టిడ్కో ఇళ్లు

గుంతల రోడ్లు

ఉమ్మడి జిల్లాలో 13 ప్రధాన రోడ్లు 157.060 కిలోమీటర్లు పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) రూ.323.59 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆదోని మండలం డాణాపురం క్రాస్ - హొళగుంద వయా హెబ్బటం ప్రధాన రహదారి 25.490 కి.మీలు ఆధునికీకరణకు ఎన్‌డీబీ నిధులు రూ.59.25 కోట్లు, కోడుమూడు-వెల్దుర్తి వయా గోరంట్ల రోడ్డు 3.00 కి.మీల నుంచి 14.500 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణకు రూ.21.09 కోట్లు, ఎమ్మిగనూరు-మాలపల్లి రోడ్డు 0/00 నుంచి 11.885 కి.మీలకు రూ.24.15 కోట్లు మంజూరు, ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డు (ఏజీ రోడ్డు) - పెద్దకడబూరు రోడ్డు 0/00 నుంచి 13.750 కిలో మీటర్ల వరకు ఆధునికీకరణకు ఎన్‌డీబీ నిధులు రూ.24.61 కోట్లు నిధులు ఇస్తే ఇక్కడ కూడా పనులు మొదలు పెట్టలేదు. వీటిపై ప్రజాప్రతినిదులు దృష్టి సారించాలి.

- కర్నూలు సర్వజన వైద్యశాలలో రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా స్టేట్ క్యాన్సర్ యూనిట్ రూ.160 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలోనే చేపడితే.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లలో భవనం మాత్రమే పూర్తి చేశారు. క్యాన్సర్ చికిత్సకు కీలకమైన లీనియర్ యాగ్జిలేటర్ (రోగి క్యాన్సర్ గుర్తించి రేడియేషన్ ట్రీట్మెంట్) వేనియర్ మిషన్లు, బ్రాకి థెరపీ, సిటీ సిమిలేర్, వెట్ సిటీ స్కాన్, ఎక్స్ రే, ఎంఆర్ఐ.. వంటి అత్యాధునిక యంత్రాలు సమకూర్చలేదు.
- కర్నూలు, ఆదోని మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే.. ఎమ్మిగనూరులో రూ.12.60 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆస్పత్రి అసంపూర్తిగా ఉంది. వాటిని పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
- కర్నూలు నగరానికి సుంకేసుల డ్యాం నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు అందించేందుకు అమృత్-2.0 కింద రూ.135 కోట్లతో పైపులైన్, పంపింగ్ స్టేషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయాలి. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ నిర్మాణం కోసం కృషి చేయాలి.
- కోడుమూరు 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరు (సీహెచ్‌సీ)ని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి. అదనపు భవనాలు, వైద్యులను నియమించాలి.
- ఆలూరు నియోజకవర్గంలో హొళగుంద, హాలహర్వి మండలాల్లో 30 ఏళ్ల క్రితం ఆనాటి జనాభాకు అనుగుణంగా ఎస్ఎస్ ట్యాంకులు, పైపులైన్లు వేశారు. జానాభా పెరగడం, పైపులైన్లు లీకేజీలు వల్ల తాగునీరు అందడం లేదు. ఈ పథకాలు ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి.
- ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని పట్టణాలు, సమీప గ్రామాల్లో చేనేత కుటుంబాలు 45 వేలకు పైగా ఉన్నారు. వారిలో చేనేత వృత్తిపై ఆధారపడిన చేనేతలు 25 వేలకు పైగా ఉన్నారు. వీరికి గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందించాలి. అలాగే.. వీరికి ఉపాధి కల్పించే మాస్టర్ వీవర్స్‌కు గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల్లో రాయితీ రుణాలు అందివ్వాలి.

ప్రాజెక్టులకు జీవం రావాలి..

జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి కోసం వేదవతి ప్రాజెక్టుకు రూ.1,942.38 కోట్లు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా ఆర్డీఎస్ కుడి కాలువకు రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు ఇచ్చారు. టెండర్లు పూర్తి పనులు కూడా మొదలు పెట్టారు. తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 21న రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ నం.154 జారీ చేశారు. వైసీపీ వచ్చాక అటకెక్కాయి. గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు ఐదేళ్లుగా నిర్వహణ నిధులు పైసా ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు, వెలుగోడు జలాశయం మరమ్మతులకు డ్రిప్-2 కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా చెల్లించక నిధులు కాలేదు. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరిట రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు ఎక్కడికక్కడే ఆగిపోయింది. తెలుగుగంగ, ఎస్సార్బీసీ కాలువ ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఉంది.

వైద్య సదుపాయాలు లేని స్టేట్ క్యాన్సర్ యూనిట్



మహిళలను మోసం చేసిన బీహార్ దొంగలు

- వెండి కడియాలకు, పట్టీలకు మెరుగులు దిద్దుతామని..
- దొంగలకు దేహశుద్ధి చేసిన గ్రామస్థులు



దొంగల చేతిలో మోసపోయిన గ్రామస్తులు

కోసిగి, జూలై 21: చింతకుంటలో బీహార్ దొంగలు మహిళల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని వారు కాళ్లకు వేసుకున్న వెండి కడియాలు, పట్టీలకు మెరుగులు దిద్దుతామని మోసం చేయబోయి దొరికిపోయారు. ఆదివారం గ్రామానికి వచ్చిన బీహార్ వ్యక్తులు నర్సప్ప గారి లక్ష్మక్క, రాగిపాటి భీమక్క, కల్లుకుంట తాయమ్మ, మునిస్వామిల వెండి కడియాలు, కాళ్ల పట్టీలు సుమారు 80 తులాల దాకా తీసుకొని మెరుగులు దిద్దుతామని చెప్పారు. వారు పెద్ద బ్యాగులలో కెమికల్, యాసిడ్, పౌడర్‌లను పెట్టుకొని మహిళలకు తెలియకుండా వెండిని కరిగించారు. వెండి బరువు తగ్గడంతో గ్రామస్థులు మహిళలు దొంగలను కాళ్ల చేతులకు తాళ్ల కట్టి దేహశుద్ధి చేశారు. బీహార్‌కు చెందిన గోపాల్ కుమార్ గుప్త, అఖిలేష్ కుమార్ గుప్త, అభిలాష్ గుప్తలను కోసిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.



బకెట్‌లో కెమికల్ తో కరిగించిన వెండి



దొంగలను తాళ్లతో కట్టివేసిన గ్రామస్థులు

దూదేకుల సంఘం చేయూత



చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా

హాలహర్వి, జూలై 21: తల్లిదండ్రులు లేక అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు దూదేకుల సంఘం తమవంతు సహకారం అందించింది. హాలహర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఆసాబి, సబియ, ఆఫ్రిన్‌లను నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఇతర నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ25వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ గూళ్యం గ్రామానికి చెందిన కాశీంసాబ్, షేకమ్మలు అనారోగ్యంతో చనిపోయారన్నారు. దీంతో వారి కుమార్తెలు ముగ్గురు అనాథలుగా మిగిలారన్నారు. ఎనిమిదేళ్లలోపు వయసున్న ఆ చిన్నారులకు దూదేకుల సంఘం అండగా ఉంటుందని వారి చదువుతోపాటు భవిష్యత్తుకు తమవంతు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వంతో పాటు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా, ఇమామ్ కాశీం, సిద్దయ్య, మస్తాన్, మాబాషా, వలిసాబ్, షేక్షావలి, హుస్సేన్ సాబ్, టీపీ సాయి, బడేసాబ్, హుస్సేన్ పీరా, ఎల్లప్ప బసవరాజ్ తదితరులు ఉన్నారు.

శోకసంద్రంలో జూనూతల

- ప్రభుత్వలాంఛనాలతో జవాన్ వెంకటేశ్వర్లు అంత్యక్రియలు
- వందలాదిగా తరలివచ్చిన అభిమానులు, గ్రామస్థులు

అవుకు, జూలై 21: విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు గన్ మిస్‌ఫైర్ అయి మృతి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ పెట్నికోట వెంకటేశ్వర్లు అంత్యక్రియలు ఆదివారం అధికార లాంఛనాలతో ముగిశాయి. స్వగ్రామం అవుకు మండలంలోని జూనూతల గ్రామంలో అశ్రునయనాల నడుమ వెంకటేశ్వర్లు అంతిమయాత్ర సాగింది. ఆయన్ను కడసారి చూసేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున జూనూతల గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామం మొత్తం ఆదివారం శోక సంద్రంలో మునిగిపోయింది. దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో 2012లో వెంకటేశ్వర్లు సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. 2022 వరకు ఢిల్లీలో విధులు నిర్వర్తించాడు. గత ఏడాది తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం బీడీఎల్ టౌన్‌షిప్‌కు వచ్చి బీడీఎల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 19తేదీన విధులకు వెళ్లి 20వతేదీ ఉదయం సీఐఎస్ఎఫ్ వాహనంలో బీడీఎల్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని బస్సు దిగుతున్న క్రమంలో చేతిలోని తుపాకీ ప్రమాదవశాత్తు పేలింది. బుల్లెట్ గడ్డం కింది నుంచి తలలోకి దూసుకెళ్లటంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ వాహనంలో ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటలకు బీడీఎల్ ఎస్ఐ డీఎస్ రవి జూనూతల గ్రామానికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో తల్లిదండ్రులతో పాటు భార్య రోదన కలచివేసింది. రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ జవాన్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. జవాన్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.



జవాన్‌కు నివాళులర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ



జవాన్ పార్థిక దేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ప్రముఖుల నివాళి

జవాన్ కుటుంబానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ జవాన్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీడీఎల్ ఎస్ఐ డీఎస్ రవి, అవుకు తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేష్, శ్రీరామ, వెంకటేశ్వర్లు, ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్‌తో పాటు గ్రామ ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. సీఐఎస్ఎఫ్ అధికారులు పంపిన సంతాప పత్రాన్ని బీడీఎల్ ఎస్ఐ రవి జవాన్ తండ్రి వెంకటస్వామికి అందించారు. అనంతరం వైకుంఠ రథంపై జవాన్ పార్థివదేహాన్ని ఉంచి శ్మశాన వాటికకు తీసుకెళ్లి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు.



తల్లితో చిన్నారులు



రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

కొడుకు మృతిని జీర్ణించుకోలేకపోతున్నా



ఒక్కగానొక్క కొడుకు కావటంతో అల్లారుముద్దుగా పెంచుకున్నాం. మేము కూలీ పనులకు పోతున్నా కొడుకు మాలాగా కష్టపడకూడదని చదివించాం. ప్రయోజకుడైన తరుణంలో దేవుడు మా తలరాతలు ఇలా రాస్తాడని అనుకోలేదు. కోడలు, మనుమడు, మనుమరాలిని చూస్తే గుండె తరుక్కుపోతోంది.

- లక్ష్మీదేవి, జవాన్ తల్లి, జూనూతల


ఏ తండ్రికీ ఇంతటి కష్టం రాకూడదు



ఇలాంటి కష్టం ఏ తండ్రికీ రాకూడదని దేవున్ని కోరుకుంటున్నా. కొడుకు జీవితం సజావుగా సాగుతున్న తరుణంలో ఇలాంటి విషయం వినాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. విధి ఆడుతున్న నాటకంలో పావులుగా ఉండిపోవాల్సి వస్తుంది తప్ప చేసేదేమీ లేదు.

- వెంకటస్వామి, జవాన్ తండ్రి, జూనూతల

అప్పుల బాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం



రంగన్న (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్/వెల్దుర్తి, జూలై 21: చేసిన అప్పులు తీర్చలేక ఉమ్మడి జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఎమ్మిగనూరు మండలంలో బోయ గుడిసె రంగన్న(39), వెల్దుర్తి మండలంలో మద్దిలేటి(48) అనే రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎమ్మిగనూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రంగన్న తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తిపంటను సాగు చేశాడు. పంట సాగు కోసం పలుచోట్ల రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా కనీసం పెట్టుబడి కూడా రాకుండా నష్టపోయాడు. ఇదే సమయంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో ఏమీ చేయలేని స్థితిలో రంగన్న సొంత పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. రైతుకు భార్య లక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తె సంతానం.

- వెల్దుర్తి మండలంలోని పుల్లగుమ్మి గ్రామానికి చెందిన వడ్డె మద్దిలేటి తనకున్న 5 ఎకరాల్లో పలు రకాల పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ.6 లక్షల దాకా అప్పులు చేశాడు. మూడేళ్లుగా పంటలు పండక, అప్పులు తీర్చలేక నిత్యం మదనపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్దిలేటి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

పెద్దపాడు బీసీ హాస్టల్ వార్డెన్‌పై వేటు

సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

కర్నూలు ఎడ్యుకేషన్, 21: కల్లూరు మండలంలోని పెద్దపాడు బీసీ హాస్టల్ వార్డెన్ పి.సత్యనారాయణ రాజుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టల్ వార్డెన్ పి. సత్యనారాయణరాజు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించడం లేదని ఇటీవలి కాలంలో ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా అలాగే హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచడం లేదని, విద్యార్థులకు వార్డెన్ అందుబాటులో లేడంటూ తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై త్రీమెన్ కమిటీతో విచారణ చేపట్టాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో విచారణ చేపట్టి పూర్తిస్థాయిలో నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ వార్డెన్ సత్యనారాయణరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వివాహిత ఆత్మహత్య

నందికొట్కూరు, జూలై 21: అత్తారింటి బాధలు తట్టుకోలేక ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు గురైన సంఘటన నందికొట్కూరు పట్టణంలోని లింగం వీధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వివరాలు.. నందికొట్కూరుకు చెందిన షేక్ హుస్సేన్‌తో బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన మాసూంబాషా కుమార్తె సాహేరాబాను(25)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 8 నెలల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో సాహేరాబాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారకులు ఆమె భర్త షేక్ హుస్సేన్, అతడి తండ్రి వలి, తల్లి షేక్ వహిద, ఆడపడుచు షేక్ రిజ్వానా, మరిది సాదిక్ కారణమంటూ మృతురాలి తండ్రి మసూంబాషా ఆరోపిస్తున్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందికొట్కూరు పోలీసులు వెల్లడించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్



కన్నమడకలలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఓర్వకల్లు, జూలై 21 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కర్నూలు డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కన్నమడకల గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వే, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాగర్ అనే ఎనిమిదేళ్ల బాలుడు విషాహారం తిని వాంతులు, విరేచనాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలుడి గృహాన్ని పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించారు. వైద్య శిబిరంలో సరిపడా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సెలైన్ ద్రావణాలు, అందుబాటులో ఉంచుకోవాలని హుశేనాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆదేశించారు. ప్రజలు కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బీసీ కాలనీలోని వాటర్ ట్యాంకు పరిశీలించి ఏపిడెమిక్ టీం నీటి నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఓ డాక్టర్ నాగప్రసాద్ బాబు, డీఎల్పీవో తిమ్మక్క, ఎంపీడీవో మల్లీశ్వరి, జిల్లా ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్, ఎంపీహెచ్ఈఓ చలపతి, ఎంపీహెచ్ఎస్ మోక్షేశ్వర్, వైద్యాధికారి డాక్టర్ రేఖ, జడ్పీటీసీ రంగనాథగౌడ్ పాల్గొన్నారు.

మీడియా వల్లే అందరికీ రాజ్యాంగ హక్కులు

● గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జూలై 21: మీడియా ఉండడం వల్లే సమాజంలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగపరమైన ప్రాథమిక హక్కులను పొందగలుతున్నారని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. నగరంలో గురుపౌర్ణమి సందర్భంగా జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన జర్నలిజం పాత్ర ఎంతో గొప్పదన్నారు. మారుమూల గ్రామాల్లో జరిగే సంఘటనలను సైతం ఎంతో వ్యయప్రయాసలకోర్చి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించంలో జర్నలిస్టుల పాత్ర ఉందని తెలిపారు. అలాంటి జర్నలిస్టులు ప్రస్తుతం గుర్తింపు లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నామినేటెడ్ పదవుల భర్తీలో న్యాయం



మంత్రి సవితమ్మకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 21: నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు న్యాయం చేస్తామని రాష్ట్ర మంత్రి సవితమ్మ హామీ ఇచ్చినట్లు కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి అన్నారు. ఆదివారం కురువ సంఘం నాయకులు విజయవాడలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మను ఆమె నివాసంలో కలిశామని చెప్పారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు శ్రీలీలమ్మ, విజయలక్ష్మి, నాయకులు ధనుంజయ, దేవేంద్ర, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నాగశేషులు, మహేశ్‌లు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణ తీరుపై వీసీ ఆగ్రహం



హాస్టళ్లను పరిశీలిస్తున్న ఉపకులపతి ఎన్‌టీకే నాయక్

కర్నూలు(అర్బన్), జూలై 21: రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్ల నిర్వహణ తీరుపై ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు ఆదివారం ఉదయం హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. హాస్టళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందిగా ఉన్న సివిల్ పనులతోపాటు ఎలక్ట్రికల్ పనులను వెంటనే దగ్గర ఉండి చేయించారు. బాలికలు, బాలుర హాస్టళ్ల భోజన వసతులు, సౌకర్యాల కల్పనలో ఏమాత్రం అలసత్వం తగదన్నారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి, వార్డెన్లు వై. హరిప్రసాదరెడ్డి, డిప్యూటీ వార్డెన్లు, వర్శిటీ ఇంజనీర్ నరసప్ప, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 21: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎ. భార్గవతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అర్జీ, ఆధార్, మొబైల్ నెంబర్లతో వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, సమస్యకు పరిష్కారం పొందవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.



పూజలందుకున్న సాయిబాబా





పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గురు పౌర్ణమి సందడి

కర్నూలు (కల్చరల్), జూలై 21: గురుపౌర్ణమి వేడుకను ఆదివారం ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కర్నూలు పాతనగరం సాయినగర్‌లోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకల్ బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కళ్లే చంద్రశేఖర శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్ పాల్గొన్నారు. కొత్తపేటలోని నాగసాయిబాబా దేవాలయం, నెహ్రూ నగర్‌లోని సత్యసా యి మందిరం, కిడ్స్ వరల్డ్ సమీపంలోని ఇస్కాన్ ధ్యాన కేంద్రం, ఇస్కాన్ సెంటర్ ఇన్‌చార్జి రఘునందన్, నగరంలోని నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని సర్వస్వతీ నగర్‌లోని శివదత్త సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 7 గంటలకు పంచామృతంతో బాబా వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీవీ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పాతనగరంలోని భగవాన్ బాలసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని సుంకేసుల రోడ్డు గాంధీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో గురుపౌర్ణమి వేడుకను ఘనంగా నిర్వహించారు. యోగ శిక్షణ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షురాలు బీటీ జయలక్ష్మి ఆధ్వర్యంలో గురువులకు ప్రత్యేక పూజలు చేసి, ఫల పుష్పాలు సమర్పించారు. యోగ సభ్యురాలు సుధ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. యోగా శిక్షకులు టీవీ రత్న ప్రసాద్, విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డిలను యోగా సభ్యులు సత్కరించారు. వెంకటరమణ కాలనీలో గల శ్రీపతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా యోగా గురువు పెరుమాండ్ల దత్తయ్య దంపతులను యోగా అభ్యాసకులు సత్కరించారు.

గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న గౌరు చరిత

కల్లూరు: గురుపౌర్ణమి వేడుకల్లో భాగం గా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హాజరై ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆదివారం బీ క్యాంప్ పోస్టాఫీస్ సమీపంలోని శంకర సాయిబాబా మందిరం, ఆరోరా నగర్‌లోని నాగసాయిబాబా ఆలయంలో ఆమె స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

● సూర్య నారాయణస్వామి ఆలయంలో..

గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీగణపతి సచిదానంద స్వామీజీ ఆశీస్సులతో గురుపూర్ణిమ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ఆదివారం ఉదయం గురుపౌర్ణమి వేడుకల్లో దత్తాత్రేయ స్వామికి విశేష క్షీరాభిషేకాలు, తైలాభిషేకాలు, దత్త హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ట్రస్టీ టి.శివరామకృష్ణ, మాతృ మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

● కల్లూరులోని అవధూత రామిరెడ్డితాత సంస్థాన్‌లో ఆలయ నిర్వాహకుడు దాసరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం స్వామివారికి మేలు కొలుపు, విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, ఓం తాత శ్రీతాత రామిరెడ్డితాత పారాయణం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేపట్టారు.

● కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని మఠంలో అవధూత నాయుడు స్వామి(రాజుస్వామి)కి ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి సేవ చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

● కోడుమూరు (రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా ప్యాలకుర్తిలో సాయిబాబా విగ్రహాన్ని పట్టువస్త్రాలు, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు. పంచామృతాభిషేకం, హారతి చేపట్టారు. సాయంత్రం సాయినాథుని చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. పులకుర్తిలోని సాయిబాబా ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో కొలువుంచి మేళతాళాల మధ్యన ఊరేగించారు. అలాగే వర్కూరు సద్గురు అల్లీహుస్సేన్, ఖాజాహుస్సేన్, దస్తగిరయ్య స్వామి దర్గాల్లో శిష్యులు గురువులను పూలమాలలతో సన్మానించారు.

● కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వ్యాసపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు ఆనంద్‌రాజు బాలు, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కదిరి రమేష్, ప్రతినిధులు జలగరి వెంకటేశ్వర్లు, టీఎన్ఆర్, వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.



బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వ్యాసపూర్ణిమ వేడుకలు

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె జాతీయ రహదారిపై వెలసిన శ్రీరామ రామేశ్వర షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, చింతలపల్లె, చెన్నంశెట్టిపల్లె, వెంకటాపురం, పాలకొలను తదితర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. కాల్వబుగ్గ గ్రామ సమీపాన వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

సి.బెళగల్: గురుపౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని కంబంధహల్, సాయిబాబకు, క్రిష్ణదొడ్డి కొండాపైన వెలసిన వెంకటేశ్వర స్వామికి, కొత్తకోటలో వెలసిన రాఘవేంద్రస్వామికి, గుండ్రేవుల, కొండాపురం, పోలకల్లు చెన్న సోమేశ్వర స్వామి, కేశవస్వాములకు ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



గురువులకు పూజలు చేస్తున్న యోగా గురువు బీటీ జయలక్ష్మి



ప్యాలకుర్తిలో భక్తుల పూజలు



ఓర్వకల్లులోని సాయిబాబా ఆలయంలో...

కమిటీ ఎన్నికలకు నాలుగో నామినేషన్

కర్నూలు(న్యూసిటీ), జూలై 21: నగర పాలక సంస్థ సంఘ కమిటీ సభ్యుల ఎన్నికకు సంబంధించి నాలుగో రోజు ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం నగర పాలక కార్యాలయంలో 15వ వార్డు కార్పొరేటర్ ఎస్.శివమ్మ(టీడీపీ) తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ ఉన్నారు. ఈ సారి ఎలాగైనా ఎన్నికలు జరిపించి టీడీపీ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో స్థానం సంపాదించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం ఐదుగురు సభ్యుల కోసం ఇప్పటి వరకు వైసీపీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో టీడీపీ నుంచి మొదటి నామినేషన్‌ను శివమ్మ అందజేశారు. వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మూడేళ్లుగా కవిటీ ఎన్నికలు జరపకుండా ఏకగ్రీవంగా చేసుకున్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఇప్పటికే వైసీపీ నుంచి 8 మంది కార్పొరేటర్లు టీడీపీ చేరారు. దీంతో టీడీపీ కార్పొరేటర్లు సంఖ్య 16కు చేరింది. ఇంకా పది మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు అనివార్యమైతే వైసీపీ కార్పొరేటర్లే టీడీపీ కార్పొరేటర్లకు ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.



మేనేజర్ చిన్నరాముడుకు నామినేషన్ అందజేస్తున్న కార్పొరేటర్

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

కర్నూలు, (ఎడ్యుకేషన్) 21: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంకటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే జీఓ నెంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.21 వేల కోట్ల బకాయిలను పెండింగ్‌లో ఉంచిందన్నారు. ఉద్యోగ హక్కుల కోసం ప్రశ్నిం చే నాయకులపై నోటీసు ఇచ్చి అరెస్టులకు పాల్పడిందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్‌ను అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గోవిందనాయక్, దేవదాస్, బాలకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం పంపిణీ

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 21: కష్టాల్లో ఉన్న జన సైనికులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన జన సైనికుని కుటుంబానికి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.5 లక్షల పరిహారం చెక్కును ఆదివారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీబీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బుధవారపేటలో ఉచిత మెడికల్ క్యాంపు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మెడిసిన్ హెచ్‌ఓడీ డా.సుధాకుమారి

కర్నూలు(న్యూసిటీ), జూలై 21: ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు ఆదివారం నగరంలోని బుధవారపేట అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ డా.సుధాకుమారి, ప్రొఫెసర్ డా.సింధియా మాట్లాడుతూ ఫ్యామిలీ అడాప్షన్ కింద ఒక్కో వైద్య విద్యార్థికి మూడు గృహాల చొప్పున మొత్తం 750 ఇళ్లను కేటాయించామన్నారు. విద్యార్థులు తమకు కేటాయించిన ఇళ్లను సందర్శించి ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.రవికుమార్, డా.నాగరాజు, డా.వైష్ణవి, డా.కేమమత, డా.శివనందన్, పీజీలు, లెక్చరర్లు సురేష్‌కుమార్, సూపర్‌వైజర్లు సాయిరాం, మాధవరాజు పాల్గొన్నారు.

సమాజంలో గురువులది విశిష్ట స్థానం

● మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



పురస్కారాలు అందుకున్న వారితో టీజీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు(కల్చరల్), జూలై 21: సమాజంలో గురువులకు విశిష్ట స్థానం ఉందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం వ్యాస పౌర్ణమి సందర్భంగా, తిరుపతిలోని హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు 'వ్యాస మహర్షి పురస్కారాలు' ప్రదానం చేశారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ప్రత్యేక అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరవ అతిథిగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేదవ్యాస మహర్షి, భరత మాత, శివాజీ మహారాజ్ చిత్రపటాలకు పుష్పమాలలు వేసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఇస్కాన్ కర్నూలు సెంటర్ ఇన్‌చార్జి రఘునందన్ సేవక్ ప్రభు, హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల, రాష్ట్ర సహాధ్యక్షుడు ఎన్ నాగరాజ శర్మ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు

కర్నూలు(అర్బన్), జూలై 21: జగన్ అస్యత ప్రచారాలను జనాలు నమ్మరని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కూటమిలోని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. వరుణ దేవుడు కరుణించడంతో జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తుండగా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు నమ్మ స్థితిలో లేరని వైసీపీ నాయకులు, జగన్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుపంటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న జి.ఓబులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 21: బీడీ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని బీడీ కార్మికుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ఫలితంగా కార్మికులు అనేక హక్కులు కోల్పోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. బీడీ కార్మికులకు ఉచిత వైద్య సదుపాయం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, స్కాలర్‌షిప్‌లు యజమానుల నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. తెలంగాణ తరహాలో కార్మికులు రూ.3 వేల పింఛన్లు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కమిటీలో తీర్మానించారు. సమావేశంలో కోకన్వీనర్ హుస్సేన్, సుధాకరప్ప, ఎస్.అబ్దుల్ దేశాయ్, రాముడు, మిన్నెల్లా తదితరులు పాల్గొన్నారు.

'ప్రతాప్ గౌడ్ సేవలు స్మరణీయం'

కర్నూలు(కల్చరల్), జూలై 21: జిల్లా రంగస్థల కళలకు, కళారంగానికి దివంగత ప్రతాప్‌గౌడ్ చేసిన సేవలు స్మరణీయమని రాష్ట్ర మాజీ మంత్రి, టీడీపీ నేత కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ రంగస్థల కళాకారుడు, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌గౌడ్ సంస్మరణ సభ నిర్వహించారు. ప్రతాప్‌గౌడ్ చిత్రపటానికి కేఈ ప్రభాకర్ పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్జా రామకృష్ణ, ప్రతాప్‌గౌడ్ బంధువులు జనార్థన్ గౌడ్, మహేష్‌గౌడ్, టీజీవీ కళాక్షేత్రం ప్రతినిధులు మహ్మద్ మియా, కే బాలవెంకటేశ్వర్లు, కళాకారులు గుర్రపుశాల అంకయ్య, చంద్రన్న, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఓర్వకల్లు, జూలై 21: ఓర్వకల్లులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం నాయకులు నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయనతోపాటు హమాలి యూనియన్ నాయకులు ఎల్లరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీరాములు, అఖిల్ తదితరులు వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. వర్షం కురిస్తే నీరంతా వసతి గృహం పరిసరాల్లో నిలవడంతో బురదమయమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు తగ్గట్టుగా స్నానపు, వసతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 21: ఈ నెల 24, 25, 26 తేదీలలో మదనపల్లిలో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లిలోని హార్సిలీ హిల్స్‌లో జరిగే శిక్షణ తరగతులకు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. పర్మినెంట్ కార్మికుల పెండింగ్ జీతాలు, డీఏ అరియర్స్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. శిక్షణ తరగతులకు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు నుంచి కార్మికులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

కరాటే పోటీల్లో అక్క, తమ్ముడి ప్రతిభ

● జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


పతకాలతో షేక్ ఉమర్ సైహన్, షేక్ సాదియా

గోనెగండ్ల, జూలై 21: పెద్దనేలటూరు గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు షేక్ సాధియ, షేక్ ఉమర్ సైహన్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో తమ ప్రతిభ కనపరచి బంగార పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తండ్రి ముమ్మద్ తెలిపారు. గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన డి.మహమ్మద్, ఎస్.యాసిన్‌బీ గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లాలో జీవనం చేస్తున్నారు. వారికి కూతూరు షేక్ సాధియా, ఒక కుమారుడు షేక్ ఉమర్ సైహన్ ఉన్నారు. కూతురు ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కుమారుడు 6వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 19, 20, 21 న తెలంగాణా రాష్ట్రం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో 12వ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించారు. అందులో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో ఆరో తరగతి చదువుతున్న షేక్ ఉమర్ సైహన్, ఎనిమిదో తరగతి చదువుతున్న షేక్ సాదియా ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించారు. ఆగస్టు నెలలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. అలాగే పుంసే పోటీలలో కూడా తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయిలో అక్క, తమ్ముడు వెండి పతకాలను సాధించారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దనేలటూరు గ్రామస్థులు సంబరాలు జరుపుకొన్నారు.

మంత్రాలయం మఠానికి విరాళం

మంత్రాలయం, జూలై 21: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరు పట్టణానికి చెందిన లక్ష్మీ అగ్నిహోత్రి రూ.2 లక్షలు, వసంత ఎన్.పాటిల్ రూ.1 లక్ష, మరొక అజ్ఞాత భక్తుడు రూ.25 వేలు, ముంబైకి చెందిన గౌరీ రాజన్ రూ.2 లక్షలు, చెన్నైకు చెందిన గాయత్రి రూ.1లక్ష అన్నదానానికి రూ.6.25 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిలు తెలిపారు. ఆదివారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని చెక్కులను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

'పదోన్నతి కల్పించాలి'

ఆలూరు, జూలై 21: విద్యుత్‌శాఖలో ఎనర్జీ అసిస్టెంట్ జేఎల్ఎం గ్రేడ్-2లను అసిస్టెంట్ లైన్ మన్‌లుగా గుర్తించి పదోన్నతులు కల్పించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు దేవేంద్రప్ప, కార్యదర్శి నాగేంద్రప్ప కోరారు. ఆదివారం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిను కలసి వినతిపత్రం అందించారు.. 2019 నుంచి 7329 మంది ఎనర్జీ అసిస్టెంట్ జేఎల్ఎంగ్రేడ్-2లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పదోన్నతి కల్పించడంతో రెగ్యులర్ చేయాలని కోరారు.

టీడీపీ నాయకుడి మృతి

ఆస్పరి, జూలై 21: మండలంలోని ఐనేకల్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తలారి వీరేష్ (45) ఆదివారం మృతి చెందారు. వీరేష్‌కు భార్య వీరేషమ్మ, కుమారులు ఉరుకుందు, విక్రమ్, కూతురు ఊర్మిల ఉన్నారు. ఆయన మృతి పట్ల టీడీపీ సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్ సంతాపం తెలిపారు. టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, మహేష్, తిమ్మన్న, ఎస్ మహేష్, సంజప్ప, సిద్ధు తదితరులు సంతాపం తెలిపారు.

'కమ్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలి'

ఆలూరు, జూలై 21: కమ్మ సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని కమ్మ సేవ సంఘం నాయకులు ప్రభుత్వాలను కోరారు. ఆదివారం కమ్మ సేవ సంఘం ఆలూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రామప్ప ప్రకాష్, సభ్యులు వైకుంఠం ఆనందకుమార్ చౌదరి రమేష్ మాట్లాడుతూ కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఫౌండర్ జెట్టి కుసుమ కుమార్‌ను కలసి కర్నూలులో కూడా కమ్మ భవన్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు నామినేట్ పదవులో కమ్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలన్నారు.

'శవరాజకీయాలు మానుకోవాలి'

ఆదోని టౌన్, జూలై 21: శవరాజకీయం చేస్తూ ఏర్పాటైన వైసీపీ ఇకనైనా శవ రాజకీయాలను చేయడం మానుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షన సమితి (ఎంఎచ్‌పీయస్) రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి తన సొంత బాబాయ్ వివేకానంద రెడ్డి మరణాన్ని కూడా రాజకీయం చేసి పబ్బం గడుపుకోవం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. జగన్ పాలనతో రాష్ట్రం బాగుపడే పరిస్థితి లేదని తెలుసుకొన్న ప్రజలు ఈ సారి ఎన్నికలలో చిత్తుగా ఓడించారని విమర్శించారు. ప్రస్తుతం ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న కక్షల కారణంగా జరిగిన హత్యను, రాజకీయ హత్యగా ప్రచారం చేసి ఢిల్లీలో ధర్నా చేస్తానని అనడంపై ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్‌షుబ్లీ ఆదేశాల మేరకు డివిజన్‌లో సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్నామని తెలిపారు.

'ప్రభుత్వం తక్షణమే స్పందించాలి'

ఆదోని (అగ్రికల్చర్), జూలై 21: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఎస్టీయూ సీనియర్ నాయకుడు బీ సత్యన్న అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో సీనియర్ నాయకుడు రామకృష్ణ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. పదో తరగతి పరీక్షలు ఆంగ్ల మాధ్యంతోపాటు తెలుగు మాధ్యమంలో కూడా రాసే విధంగా ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకొని ప్రకటించాలన్నారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, సుధాకర్ బాబు, హోన్నూరువలి, గాది లింగప్ప, రాము, భాస్కర్, మహమ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.

'పేదలకు అండగా ఉంటాం'


కేక్ కట్ చేస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

తుగ్గలి, జూలై 21: మండలంలో పేదలందరికీ అండగా ఉంటామని టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. ఆదివారం తుగ్గలి నాగేంద్ర స్వగృహంలో వరలక్ష్మి పుట్టిన రోజు పురస్కరించుకొని పేదలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం కేట్ కట్ చేసి సంబరాలు చేకున్నారు. వారు మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామ న్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుగుచెందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెరవలి మధు, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి

భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు ● దర్శించుకున్న ప్రముఖులు ● భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు


గోనెగండ్లలో సాయి పల్లకీ ఊరేగింపు


ఎమ్మిగనూరులో దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు


ఆదోనిలో భక్తులకు అన్నదానం


ఆలూరులో భక్తులతో కిటకిటలాడుతున్న సాయిబాబా ఆలయం


వెల్దుర్తిలో..

ఆదోని టౌన్, జూలై 21: ఆదోనిలోని వైఎంకే నగర్‌లోని సాయి బాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బాబాకు విష్ణు సహస్రనామం, క్షీరాభిషేకం, నారాయణ సేవ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. షిర్డీ సాయి సేవా నిర్వహించారు. షిర్డీ సాయి సేవా సమితి సభ్యులు టీజీ రామ్ ప్రసాద్, వీర స్వామి, డీవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

ఆదోని (అగ్రికల్చర్): ఆదోని పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆదివారం సాయిబాబా దేవాలయాలు భక్తులతో కిటకటలాడాయి. పట్టణంలోని ఎస్కేడీ కాలనీ, టీజీఎల్ కాలనీలోని సాయిబాబా దేవాలయాల్లో బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

ఆదోని రూరల్: గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. ఎమ్మిగనూరు రహదారి బైచిగేరి శివారులో వెలసిన సాయిబాబా దేవాలయంలో భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. బాబాకు వివిధ పూలతో, బంగారు వెండి ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలూరు: ఆలూరు పట్టణంలో వెలసిన సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున కాగడా హారతి, అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించారు.. ఈ సందర్భంగా గురువులు ఈశ్వర హరినాథ్ బాబు (ప్యాపిలి) విగ్రహాన్ని దాతలు రామలక్ష్మి, రిటైర్డ్, టీచర్ తిమ్మప్పలు ప్రతిష్ఠించారు.. ఈ పూజోత్సవానికి భారీ ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయం కటికిటలాడింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కమ్మర చేడులో వెలసిన బాబా ఆలయంలో కూడా వేడుకలు వైభవంగా నిర్వహించారు.

హొళగుంద: స్థానిక సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సదర్భంగా షిరిడీ సాయిబాబా సేవ సేవ ట్రస్టు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ సిబ్బంది శ్రీకాంత్, బద్రీనాథ్ ఆదివారం తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక పూజలైన సత్యవ్రతలు, చందనోత్సవం, పుష్పాభిషేకం లాంటి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు.వందలాది భక్తులు భక్తిశ్రద్ధలతో సాయినాథుడిని దర్శించుకొని మహా హారతిలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మిగనూరు: గురుపౌర్ణమి వేడుకలు ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలమధ్య జరుపుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావటంతో షిరిడి సాయిబాబా ఆలయాలు సాయి నామస్మరణంతో మారుమోగాయి. పట్టణంలోని దత్తసాయి దేవాలయంలో ఉదయం 5.15 కాగడహాతితో పూజలు ప్రారభమయ్యాయి. అలాగే ఆలయంలో ఉన్న ద్వాదశజ్యోతిర్లింగాలకు పంచామృతాభిషేకం చేశారు. సాయికి సహస్ర నామావళి తమళపాకులతో పూజల్లో మహిళలు హాజరై నిర్వహించారు. వెంకటసాయి ఆలయం, టీబీపీ కాలనీలో వెలసిన సాయిబాబా పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం, ఎంఎస్ నగర్ వెనుక వెలసిన బాబా ఆలయంలో సాయినామ సచ్చరిత్ర ఆధ్యయన పాఠనం, మహాక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, గురుపూజ సామూహిక పూజలు నిర్వహించారు. వెంకటసాయి ఆలయంలో నగర సంకీర్తన, మేలుకొల్పు హారతి, అఖండ క్షీరాభిషేకం, మధ్యాహ్నం హారతి, సాయంత్రం సాయిబాబా రథోత్సవాన్ని నిర్వహించారు. పట్టణవాసులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వీవర్స్ కాలనీలో వెలసిన సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీబీపీ కాలనీలో వెలసిన ఆలయంలో బాబాకు బంగారు కిరీటదారణ భక్తులను అలరించింది. వేడుకల్లో ఆలయ నిర్వహకులు భాస్కర్ రెడ్డి,నాగరాజుస్వామి, వెంకటేష్, గంగన్న, గోపాల్‌స్వామి, శ్రీరాములు, నలంద మహానందయ్య, సాయి శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, డా. సత్యన్న, టీచర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో పాత ఈశ్వరదేవాలయం నుంచి తుంగభద్ర కాలు దగ్గర ఉన్న శివాలయం వరకు సాయిబాబా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. వేముగోడులో సాయిబాబా ఆలయంలో వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు రవిప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణవేణి, ఉరుకుందరెడ్డి, రవి, శ్రీనివాసులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోసిగి: కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిరుత్విక్ గట్టు రమేష్, పాడురంగా ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రపటాన్ని గ్రామంలో ఉరేగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కౌతాళం: మండలంలో ఆదివారం సాయిబాబా భక్తులు సాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్యంగా కుంబళనూరు క్యాంపు, రాజానగర్ క్యాంపు, ఎరిగేరి, కామవరం గ్రామాలలో వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దకడుబూరు: పెద్దకడబూరు, దొడ్డిమేకల, తారాపురం గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఆలయాల్లో భజనలు, నిర్వహించారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


వెల్దుర్తి: పట్టణంలో స్థానిక జర్నలిస్టు కాలనీలో వెలసిన షిర్డీ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడకలను నిర్వహించారు. టీడీపీ జిల్లా నాయకులు శివశంకర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు బలరాంగౌడులు సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు బంగారుషాపు శేషు, ఫర్టిలైజర్ రాముడు ప్రసాద వితరణ చేశారు.

మద్దికెర: స్థానిక సాయినగర్ కాలనీలో వెలసిన షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం మూలవిరాట్ షిరిడీ సాయిబాబాకు పూజలు చేశారు. కాగడ హారతి, ధ్వనిపూజ, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటాన్ని పురువీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు గాంధీ, మల్లికార్జున, హరి, రామచంద్ర, అంజి పాల్గొన్నారు.


హొళగుందలో..


కోసిగిలో..


మద్దికెరలో..


బైచిగేరిలో..


కౌతాళం: కుంబళనూరు క్యాంపులో..

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జూలై 21: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఉమేష్ ఎం. అడిగ, బళ్లారి జిల్లా ఎస్పీ శోభారాణి కుటుంబ సమేతంగా శనివారం రాత్రి మంత్రాలయంలో బస చేసి ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వేర్వేరు సమయాల్లో వచ్చిన వీరికి మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, వ్యాసరాజార్, ప్రకాష్ ఆచార్, అనంతస్వామి, ఏఎస్ఐ పెద్దయ్య, రంగస్వామి, బసప్ప ఉన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

వెల్దుర్తి, జూలై, 21: వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవేంద్ర బాబు సూచించారు. ఆదివారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులు, రైతులకు పలు సూచనలు చేశారు. పవర్ కట్ ఉన్న సమయంలో వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌ఫార్మర్, ఏబీ స్విచ్‌ల వద్ద సొంతంగా రిపేరి చేయకూడదన్నారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు పడిపోయినా, విద్యుత్ వైర్లు కిందపడి ఉన్నా వెంటనే విద్యుత్‌శాఖకు ఏఈ, లైన్‌మెన్‌కు గాని 1912 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని అన్నారు. మోటార్లు, స్టార్టర్ల వద్ద రబ్బరు మ్యాట్ ఉపయోగిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కండెక్టర్‌లపై ప్లాస్టిక్ పైపులు వేయకూడదని, వినియోగదారులు గృహాల్లో ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలను వాడాలన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఆదోని రూరల్, జూలై 21: అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త వేధిస్తున్నాడంటూ విరుపాపురానికి చెందిన వనిత తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2022 ఫిబ్రవరిలో కోసిగి మండలం దేవిబెట్టకు చెందిన హనుమంతుతో వనితకు వివాహం జరిగింది. ఏడాది పాటు సంసారం అన్యోన్యంగా సాగింది. అయితే ఆ తర్వాత భర్త హనుమంతుతోపాటు అత్త మామలు కామాక్షి, చిన్న ఆంజనేయులు వేధించడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

'ఉప ముఖ్యమంత్రి పవన్‌కు భద్రత పెంచాలి'

మద్దికెర, జూలై 21: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు భద్రత పెంచాలని సౌత్ ఇండియా కాపు కార్పొరేషన్ రాయలసీమ ఇన్‌చార్జి వైపీ ఈరన్న కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు ప్రాణహాని ఉన్నట్లు నిఘావర్గాలు వెల్లడించాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పవన్ కళ్యాణ్‌కు జడ్‌ప్లస్ క్యాటగిరి కల్పిచాలని కోరారు. జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు మొలగవెళ్లి వెంకటేశ్వర్లు ఉన్నారు.

13 మందిపై కేసు నమోదు

హొళగుంద, జూలై 21: హొళగుంద మండలంలోని మద్దటామాగి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డితో పాటు మరో 13 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయినట్లు ఎస్ఐ పెద్దయ్య నాయుడు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొహరం పండుగ సందర్భంగా పీర్ల దేవుళ్ల ఊరిగింపుగా వెళ్తున్న సందర్భంగా నాగేంద్ర అనే వ్యక్తిపై దాడి చేసినట్లు తెలిపారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'రాష్ట్రపతి పాలన కోరడం సిగ్గుచేటు'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 21: మాజీ సీఎం వైసీపీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రపతి పాలన కోరడం సిగ్గుచేటని జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యులు ఎన్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, మైనార్టీ నాయకుడు సాయినగర్ బాషా అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదేళ్ల కాలంలో జగన్ సర్వనాశనం చేశారన్నారు. జగన్ పాలనలో రౌడీయిజం, భూకబ్జాలు, అక్రమమైనింగ్, గంజాయి. మాఫియాతో రాష్ట్రం రాక్షస పాలగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్‌డీఏ కూటమికి అఖండ విజయాన్ని అందిచారన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కక పోవడంతో జగన్ శవరాజకీయాలు చేస్తున్నారని అన్నారు. హంతకులను పక్కన పెట్టుకొని పరామర్శకు వెళ్లడం సిగ్గ చేటన్నారు.

'వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి'

ఆదోని (అగ్రికల్చర్), జూలై 21: గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం కాబడ్డ జిల్లాలోని నీటిపారుదుల ప్రాజెక్టులను నిర్మించి వలసలను నివారించాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ నుంచి రాష్ట్ర వాటా కింద 734 క్యూసెక్కుల నీరు అందాల్సి ఉండగా కేవలం 250 క్యూసెక్కులు నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయన్నారు. ఆ నీటిని వాడుకోవడానికి హగరి వద్ద ప్రాజెక్టు నిర్మించి గ్రావిటీ ద్వారా వేదవతి నదికి అనుసంధానం చేస్తే 60 టీఎంసీల నీటిని నిలువ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని దీంతోపాటు ఆలూరు, ఆదోని మంత్రాలయం, ఎమ్మిగనూరు కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో సాగుతాగు, నీరుకు ఇబ్బంది ఉండదు అన్నారు. కర్ణాటక రైతుల జలచౌర్యాన్ని అరికట్టాలంటే అండర్ గ్రౌండ్ పైప్లైన్ ద్వారా ఎల్ఎల్సీకి అనుసంధానం చేయాలని కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి జల వనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

27న మార్కెట్‌లో దుకాణాల నిర్వహణకు వేలం

ఆలూరు, జూలై 21: ఆలూరు పట్టణంలోని సొంత మార్కెట్లో ఏడు సంవత్సరాల క్రితం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ రాజకీయ గ్రహణంతో ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారడంతో ఈనెల 10నా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన షాపింగ్ కాంప్లెక్స్‌కు గ్రహణం అనే కథనంపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ్ నాయుడు వేలం పాటలు నిర్వహించాలని ఆదేశించడంతో ఈనెల 27న షాపింగ్ కాంప్లెక్స్‌లోని మొత్తం 27 దుకాణాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ ప్రకాష్ నాయుడు ఆదివారం తెలిపారు. వేలం పాటలో పాల్గొని చిరు వ్యాపారులు 26న సాయంత్రం 5 గంటలలోపు డిపాజిట్లు చెల్లించాలని తెలిపారు.. 1-10, 7 నుంచి 21 వరకు రూ.50వేలు డిపాజిట్‌తో పాటు 1 లక్ష విలువ గల సాల్విన్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. అలాగే 11-15, మరియు 22 నుంచి 27 వరకు రూ.40 వేలు డిపాజిట్ చేయాలన్నారు. 22 నుంచి పంచాయతీ కార్యాలయంలో అప్లికేషన్ తీసుకొని సమర్పించాలన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు


శ్రీమఠం మధ్వమార్గ్ కారిడార్‌లో భక్తులు

మంత్రాలయం, జూలై 21: ప్రముఖ పుణ్యక్షేత్ర మైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గురు పౌర్ణమి శుభదినం ఆదివారం సెలవు కలసి రావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.స్వామి వారి దర్శన క్యూలైన్లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తులు రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు.

'సమస్యలు పరిష్కరించాలి'


మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన వెంకప్ప

ఆలూరు, జూలై 21: ఆలూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలసి విన్నవించినట్లు ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప, ఆదివారం తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో వేదిస్తున్న తాగు నీటి సమస్య, రహదారుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. రైతులకు మేలు చేసే విధంగా జింకల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

'రైతులను ఆదుకోవాలి'

ఆలూరు, జూలై 21: రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం కోరారు. ఆదివారం ఆలూరు మండల పరిషత్ కార్లాయంలో ఏపీ రైతు సంఘం ఆలూరు తాలూక సమావేశం సీపీఐ మండల కార్యదర్శి రామాంజినేయులు అధ్యక్షతన నిర్వహించారు జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయా సంక్షోభం ఏర్పడిందని రైతులు పంటలు పండక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల ద్వారా అవసరమైన రుణాలు అందించాలన్నారు. కర్నూలు జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులు ఏ మాత్రం పూర్తి కాలేదన్నారు. మూడేళ్లుగా జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడినా పరిహారం చెల్లించలేదన్నారు. వేదవతి, గుండ్రేవుల పులికనుమ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతన్నలను ఆదుకునే విధంగా ఉమ్మడి జిల్లాల్లో చెరువులు నింపి ఆదుకోవాలన్నారు. ఈనెల 29,30,31 తేదీల్లో మదనపల్లిలో జరిగే ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనంకు రైతులు తరలి రావాలన్నారు. నాయకులు పంపన్న గౌడ్, తిమ్మయ్య, భూపేశ్, చంద్ర కాంత రెడ్డి, చాపల గోపాల్, రంగన్న, అంజినేయ, శివ పాల్గొన్నారు.